క్లుప్తంగా

జీపీ కార్మికులు భిక్షాటన



భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం సమ్మె 30వ రోజుకు చేరడంతో సారంగాపూర్ మండలకేంద్రం కార్మికులు ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజల వద్ద భిక్షాటన చేస్తూ జీపీ కార్మికుల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేలా సహకరించాలంటూ వేడుకుంటున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

సారంగాపూర్: ప్రాథమిక స్థాయి 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు గణితం పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యేలా అభ్యాసన పత్రాలు, పాఠ్యప్రణాళిక రూపొందించాలని ఎంఈవో వాసం భీమయ్య, సెక్టోరియల్ అధికారి మహేశ్ అన్నారు. శుక్రవారం సారంగాపూర్ ప్రభుత్వ, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమం నిర్వహించారు. రెండురోజులు ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కో ఆర్డినేటర్ నరేందర్, అదనపు కోఆర్డినేటర్ వేణు, రిసోర్స్‌పర్సన్లు నరేశ్, కిరణ్ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ



గొర్రెలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: యాదవులకు రెండోవిడత గొర్రెలను శుక్రవారం జెడ్పీటీసీ భారతి, ఎంపీపీ భీమేశ్వరి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నంలో 63 మంది లబ్ధిదారులకు 12 మందికి గొర్రెల యూనిట్లు మంజూరు కాగా అందించారు. మిగిలిన లబ్ధిదారులకు త్వరలోనే అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచు నేమూరి లత, ఎంపీటీసీలు తిమ్మణి రాములు, పొనకంటి వెంకటి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, నాయకులు రెబ్బటి రాజేందర్‌యాదవ్, కమటం రమేశ్, జాజాలజగన్‌రావు, జేడీ.సుమన్, జిల్లాల పవన్,నరేశ్, యాదవులు పాల్గొన్నారు.

108ను సద్వినియోగం చేసుకోవాలి

మండల ప్రజలు 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలానికి నూతనంగా మంజూరైన 108 అంబులెన్స్‌ను ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి కిరణ్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మధుయాష్కీకి సన్మానం



మధుయాష్కీతో జగిత్యాల కాంగ్రెస్ శ్రేణులు

జగిత్యాలటౌన్: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీని జగిత్యాల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం మధుయాష్కీ అధ్యక్షతన ప్రచారకమిటీ సమావేశంనిర్వహించారు. సమావేశానికి జగిత్యాల నుంచి టీపీసీసీ ప్రచారకమిటీ సభ్యులు గిరినాగభూషణం, బండ శంకర్, ముంజాల రఘువీర్‌గౌడ్ హాజరయ్యారు కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను జగిత్యాల నాయకులు ఘనంగా సన్మానించారు.

కులసంఘాల అభివృద్ధికి కృషి

కోరుట్ల: కులసంఘాల అభివృద్ధికి కృషిచేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సంజయ్ అన్నారు. ఈమేరకు పట్టణంలోని మున్నూరుకాపు కులసంఘానికి రూ.4 లక్షలు, గోనె కాపు సంఘానికి రూ.3 లక్షలు ప్రొసీడింగ్ పత్రాలను ఆయా సంఘాల నాయకులకు అందించి మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గంలో కుల సంఘాల బలోపేతానికి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.అన్ని కుల సంఘాలకు నిధులు మంజూరు చేస్తూ భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యం వైపు 'మిషన్ ఇంద్రధనస్సు'



జగిత్యాల: చిన్నారులు, గర్భిణులు, వందశాతం వ్యాక్సినేషన్ తీసుకోవాలనే ఉద్దేశంతో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. పుట్టిన పిల్లల నుంచి 16 ఏళ్లలోపు వారికి వివిధరకాల వ్యాధుల నివారణ వ్యాక్సిన్లు వేస్తుంటారు. కాగా, టీకాలు తీసుకోకుండా మిగిలిన వారికోసం ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో జిల్లాలో ఇంటింటా సర్వే చేపడుతున్నారు. వైద్య శాఖ సిబ్బంది ప్రతి ఒక్కరి వివరాలను సేకరిస్తూ రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారు.

మూడు విడతల్లో...

ఈ కార్యక్రమాన్ని మూడు విడతల్లో కొనసాగిస్తున్నారు. మొదటి విడతలో ఆగస్టు 7నుంచి 12వ తేదీ వరకు, రెండో విడతలో సెప్టెంబర్ 11నుంచి 16 వరకు, మూడోవిడతలో అక్టోబర్ 9నుంచి 14 వరకు టీకాలు ఇవ్వనున్నారు. ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఇదివరకు టీకా తీసుకోని పిల్లలందరికీ ఇవ్వనున్నారు. వాస్తవానికి ఆరోగ్య ఉప కేంద్రాలు, పీహెచ్‌సీలు, ప్రభుత్వాస్పత్రుల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉన్నప్పటికీ వివిధ కారణాలతో కొందరు టీకా వేసుకోలేదు. వారిని ఉద్దేశించి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు.

వందశాతం టీకాలే లక్ష్యం

ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇదివరకు తీసుకోని, కొన్ని తీసుకుని మానేసిన వారిని గుర్తించి అర్హులైన గర్భిణులకు టీకాలు వేయించి వందశాతం లక్ష్య సాధించాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పిల్లల జాబితాను ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తయారుచేసి సిద్ధంచేశారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలు, వలసకూలీలు, స్లమ్ ఏరియాలపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డుమెంబర్లు, కౌన్సిలర్లను భాగస్వామ్యం చేసుకుని మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం విజయవంతానికి చర్యలు చేపడుతున్నారు.

యూవిన్ పోర్టల్‌లో నమోదు

ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా వ్యాక్సినేషన్ చేయాల్సిన వివరాలను సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యూవిన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. టీకా తీసుకున్న, తీసుకోని వారి వివరాలు ఇందులో నమోదు చేయనున్నారు. చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూస్తున్నారు.

వందశాతం లక్ష్యం



జిల్లాలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ వ్యాధినిరోధక టీకాలు ఇస్తున్నాం. గర్భిణులకు సైతం మూడు టీకాలు వేయడం, చిన్నారులకు ఏటీకా ఇవ్వ లేదో వాటి వివరాలు నమోదు చేసి వారికి టీకాలు వేస్తున్నాం. ఇందులో ప్రజలు ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేశాం.

– శ్రీధర్, డీఎంహెచ్‌వో

తల్లిపాలు చిన్నారులకు ఎంతో శ్రేష్ఠం



కోరుట్లలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న కౌన్సిలర్



తుంగూర్ అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు

రాయికల్/జగిత్యాల/కోరుట్లరూరల్/పెగడపల్లి/సారంగాపూర్/మల్లాపూర్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపైఅవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతాలు చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు బాలామృతం కోడిగుడ్లు పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మల్లాపూర్: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి



నీటి నిల్వలు పారబోస్తున్న ఎంపీడీవో పుల్లయ్య

మల్లాపూర్/రాయికల్/పెగడపల్లి: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, చొప్పదండి నియోజకవర్గాల వ్యాప్తంగా శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాపూర్ మండలకేంద్రంలో అధికారులు, గ్రామస్థాయి సిబ్బందితో నీటినిల్వలు తొలగించడం, చేతులు కడుక్కోవడంలో మెళకువలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాయికల్ పట్టణంలోని నాలుగో వార్డులో కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది కాలువల్లో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో పుల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని ఉప్పుపల్లె, లింగాపూర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రైడేలో పాల్గొని అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, వార్డుసభ్యులతో కలిసి ఇంటింటా పర్యటించారు. ఇంటి ఆవరణలో ఉన్న నీటి ట్యాంకులు, రబ్బర్‌టైర్లను పరిశీలించి వీధుల్లోని గుంతలను పరిశీలించి వాటిలో నీటి నిల్వలు తొలగించారు.

ప్రభుత్వ 'ఆసరా'పై బీడీ టేకేదార్ల హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న టేకేదార్లు



ధర్మపురిలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మెట్‌పల్లి/ధర్మపురి/మల్లాపూర్: ప్రభుత్వం ఆసరా పథకంలో భాగంగా బీడీ టేకేదార్లకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో శుక్రవారం టేకేదార్లు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ధర్మపురి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆ ర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ వివిధ గ్రామాలకు చెందిన టేకదారులు పాల్గొన్నారు. మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ గ్రామంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చిత్రపటాలకు రైతులతో కలిసి సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్ క్షీరాభిషేకం చేశారు. ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఏనుగు రాజరెడ్డి, నాయకులు మిట్టపెల్లి పెద్ద రాజరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'ఆచరణ సాధ్యంకాని హామీలతో బీఆర్ఎస్ మోసం'



మాట్లాడుతున్న కరం

మెట్‌పల్లి: ఆచరణ సాధ్యం కానీ హామీలిచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని సుప్రీంకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు కొమొరెడ్డి కరం విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు, బీసీ బంధులతో ఆయా వర్గాలకు పెద్దగా ప్రయోజనం కలగదన్నారు. కేవలం ఓట్ల కోసమే తప్ప ఆవర్గాల అభ్యున్నతిపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఆకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో జాప్యం తగదన్నారు. వెంటనే ఎకరానికి రూ.10వేలు చెల్లించాలన్నారు. రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలుచేస్తామని ప్రకటించిందని, కానీ ఆలోపే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశముందన్నారు. రైతులను మరోసారి మోసం చేయడానికే రుణమాఫీని తెరపైకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యామ రాజయ్యతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

కత్తెర పురుగు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో లావణ్య

మల్లాపూర్: పంటలను ఆశించే కత్తెర పురుగు నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో లావణ్య సూచించారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని నడికుడ గ్రామంలో మొక్కజొన్న సాగుచేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటల్లో కత్తెర పురుగు ఆశించడంతో పంట దిగుబడి నష్టం వస్తుందన్నారు. పురుగు ఆశించిన మొదటిదశలోనే గుర్తించి మందులు పిచికారీ చేస్తే కత్తెర పురుగు వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ఇదివరకే నార్లు పోసుకున్న రైతులు నాట్లను వెంటనే పూర్తిచేయాలన్నారు. అధిక వర్షాలతో నార్లు చెడిపోయిన రైతులు వరిలో స్వల్పకాలిక రకాలను ఎంచుకుని దమ్ముచేసిన పోలంలో నేరుగా విత్తుకోవాలని, లేదా డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు చేయాలని సూచించారు. సర్పంచ్ భూక్య రవి, ఉపసర్పంచ్ దేవుడి గంగాధర్, ఎఈవో అనిల్‌కుమార్,రైతులు భూక్యరవి, పోతారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించాలి

మల్లాపూర్: గ్రామాల్లోని ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై సంపూర్ణ అవగాహన కల్పించనున్నట్లు కోరుట్ల ఆర్డీవో కార్యలయం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ప్రజలకు ఈవీఎం, వీవీప్యాడ్లపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్ఐ రాజయ్య, హెచ్‌ఎం అనిత, ఐకేపీ సీఏ సరిత, వీఆర్ఏలు అంజయ్య, బాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య బంధు ఇవ్వాలని వినతి

కథలాపూర్: మేడిపెల్లి, భీమారం మండలాల్లోని ఆర్యవైశ్యులకు ఆర్యవైశ్య బంధు పథకం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్లకు వినతిపత్రం ఇచ్చారు. ఈ పథకంలో ఒకొక్కరికి రూ. లక్ష సాయం అందించాలన్నారు. ఆర్యవైశ్యులకు సరైన ఉపాధిలేక ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్‌లు అందజేత

కోరుట్ల: పట్టణంలోని వివిధ కులసంఘాలకు రూ.10 లక్షల ప్రొసీడింగ్‌లను బీఆర్ఎస్ నియోజకవర్గ నేత కల్వకుంట్ల సంజయ్‌కుమార్ శుక్రవారం అందించారు. గొనె కాపు సంఘానికి రూ.3 లక్షలు, మున్నూరుకాపు సంఘానికి రూ.4 లకలు, కల్లూర్ రోడ్డులోని స్నేహమిత్ర సంఘానికి రూ.3 లక్షల ప్రొసీడింగ్‌ను అందించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, వైస్‌చైర్మన్ పవన్, ఎంపీపీ తోట నారాయణ, పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

మెట్‌పల్లి: రాహుల్‌గాంధీకి విధించిన జైలుశిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించడంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తంచేశారు. ఈ తీర్పు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న బీజేపీకి చెంపపెట్టులాంటిదన్నారు.

సంకష్టహర చతుర్థి వేడుకలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి – మహాగణపతి ఆలయంలో శుక్రవారం సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముత్యాలశర్మ మంత్రోచ్చారణలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

తీగలధర్మారంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం తనిఖీలు



ధర్మపురి: మండలంలోని తీగలధర్మారంలో శుక్రవారం స్వచ్ఛసర్వేక్షణ్ కేంద్ర బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో స్వచ్ఛసర్వేక్షణ్‌లో చేపట్టిన పనులను పరిశీలించారు. స్థానికుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం పరిస్థితులపై వివరాలు సేకరించారు. మరుగుదొడ్లు లేని వారి వివరాలు ఆరాతీశారు. కార్యక్రమంలో సర్పంచ్ అయిల్నేని అండాళు, ఉపసర్పంచ్ పందిరి అశోక్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, గ్రామ కార్యదర్శి నవీన్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరావాలి

మెట్‌పల్లి: గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శనివారం హైదరాబాద్‌లో చేపడుతున్న మహాధర్నాకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో తరలిరావాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాంసుందర్ శుక్రవారం కోరారు. గురుకులాలకు సొంత భవనాలను సమకూర్చడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపడుతున్న మహాధర్నాను టీచర్లువిజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలి

ధర్మపురి: డిగ్రీ గురుకుల కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఈనెల 13 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకిషన్ తెలిపారు.జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఓ ప్రైవేట్ బిల్డింగులో మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేశారు. ఆగస్టు 2023 నుంచి డిగ్రీ కళాశాలలో తరగతులు ప్రారంభించామని మిగిలిన సీట్లభర్తీకి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2023–2024 విద్యాసంవత్సరానికి గాను బీఏ (ఈపీహెచ్), బికాం, (సీఏ), బి.కాం (బీఏ), బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(ఎంపీసీఎస్), (ఎంసీడీఎస్), (ఎంఎస్‌సీఎస్) బీజెడ్సీ గ్రూపుల్లో ఖాళీలున్నాయన్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంద, ఉచిత పుస్తకాలు అందిస్తామన్నారు. ఎలాంటి పరీక్ష ఫీజు ఉండదని అడ్మిషన్ సమయంలో రూ.2,250 రుసుము చెల్లించాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ రాధాకిషన్ తెలిపారు.

అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి



మాట్లాడుతున్న మోర హన్మండ్లు

రాయికల్: పట్టణంలో అందరి సహకారంతో చెన్నకేశవ నాథ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మున్సిపల్‌చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయ అభివృద్ధిపై యువజన సంఘం, కులసంఘం నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, ప్రతి ఒక్కరి సహకారంతో ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ సర్పంచులు డాక్టర్ రాజిరెడ్డి, తాటిపాముల విశ్వనాథం, మచ్చనారాయణ, ఆలయకమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు



పుష్పగుచ్ఛం ఇస్తున్న డెప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ

జగిత్యాలరూరల్: రూరల్ తహసీల్దార్‌గా రాంమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ వినయ్‌సాగర్, ఆర్ఐ భూమయ్య, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఇక్కడ పనిచేసిన నవీన్‌కుమార్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు.

కోరుట్ల తహసీల్దార్‌గా కిషన్



పూలమొక్క అందిస్తున్న తహసీల్దార్

కోరుట్ల/కోరుట్ల రూరల్: కోరుట్ల నూతన తహసీల్దార్‌గా ఇట్యాల కిషన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ నీరటి రాజేశ్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కిషన్ నియమితులయ్యారు. తహసీల్దార్ కిషన్ కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఆర్డీవో రాజేశ్వర్‌ను కలిసిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

తహసీల్దార్‌గా ముంతాజోబొద్దీన్



కథలాపూర్: కథలాపూర్ తహసీల్దార్‌గా ఎం.కే ముంతాజోబొద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీపై వెళ్లారు. నిజామాబాద్ జిల్లా బోధన్ తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.కే ముంతాజోబొద్దీన్ కథలాపూర్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.

విద్యార్థులకు ఎంఈవో అభినందన



అభినందిస్తున్న ఎంఈవో భూమయ్య

వెల్గటూర్: రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌స్కూల్ సెలక్షన్‌కు అర్హత సాధించిన విద్యార్థులను శుక్రవారం వెల్గటూర్ ఎంఈవో బత్తుల భూమయ్య అభినందించారు. వెల్గటూర్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థి సామిత, 4వ తరగతి విద్యార్థి శ్రీప్రియలు రాష్ట్రస్థాయి సెలక్షన్ ట్రైల్స్‌కు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం సత్యం తెలిపారు. వెల్గటూర్ మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉందని, వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్యను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో వెల్గటూర్ ఎంపీపీఎస్ హెచ్‌ఎం సత్యం, ఫిజికల్ డైరెక్టర్ రాజమల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమ్మెకు సంఘీభావం తెలిపిన చక్రపాణి

వెల్గటూర్: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వెల్గటూర్ బీజేపీ మండల అధ్యక్షుడు తంగళ్లపల్లి చక్రపాణి డిమాండ్ చేశారు. నెల రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మెచేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో కార్మికులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గుంత సంతోష్, మండల ప్రధానకార్యదర్శి రాయిల్ల రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు తిరుమల ప్రమోద్, సీనియర్ నాయకులు బైకని రవీందర్ పాల్గొన్నారు.